ప్రజాశక్తి
సోమవారం 12 జూన్ 2023 5 విజయనగరం

26, 27 డివిజన్లలో గడపగడపకు..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 26, 27 డివిజన్ల పరిధిలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. జొన్నగుడ్డి రామ మందిరం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల, జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల ప్రజాస్పందనలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, కార్పొరేటర్ దుప్పాడ సునీత, దుప్పాడ అప్పారావు, వైసిపి నాయకులు ఎవర్ణ కుమారస్వామి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న కోలగట్ల

విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

అమిత్ షా గో బ్యాక్

పలుచోట్ల వామపక్షాల నిరసనలు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆందోళనలు చేపట్టారు. బిజెపి ఆంధ్రాకు తీరని ద్రోహం చేసిందని వామపక్ష కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్రా ద్రోహి బిజెపి, గో బ్యాక్ అమిత్ షా.. అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసి, విశాఖలో విజయోత్సవ సభ నిర్వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు. నిరసనలకు పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అమిత్‌షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్లు విద్రోహ పాలన సాగించిందని ధ్వజమెత్తారు. ఆంధ్ర రాష్ట్రానికి, అందునా ఉత్తరాంధ్రకు, విశాఖపట్నానికి తీవ్ర ద్రోహం చేసిందని విరుచుకుపడ్డారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ఎపి పునర్విభజన చట్ట హామీలను తుంగలో తొక్కిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి అన్నింటా ద్రోహం చేసి విశాఖలో విజయోత్సవ సభకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఇది విజయోత్సవ సభ కాదని, రాష్ట్రానికి విద్రోహ సభంటూ నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసి, కేంద్రమంత్రి అమిత్‌షా ఏ మొహం పెట్టుకుని విశాఖకు వస్తున్నారని నిలదీశారు. కేంద్రం అన్నింటా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తుంటే అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు పల్లెత్తు మాటనకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసేలా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికి పూనుకున్న మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు, పి.రమణమ్మ, బి.రమణ, సిపిఐ నాయకులు రంగరాజు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : కేంద్రహోం శాఖామంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో బజారు జంక్షన్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, సిపిఐ నాయకులు కె.అప్పన్న, ఎం.శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ నాయకులు శ్రీరామ్మూర్తి, పట్టణ కళాసీ సంఘం నాయకులు అప్పారావు, పికెఎస్ నాయకులు టి.అప్పలనాయుడు, పిసిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజాం : అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ రాజాంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం నాయకులు సిహెచ్.రామ్మూర్తినాయుడు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రాజేష్, గిరి, అచ్యుతరావు, సుధాకర్, శంకర్‌రావు, చినబాబు, శ్రీను, శోభన్‌బాబు, రవి, గురువులు పాల్గొన్నారు.

భోగాపురం : అమిత్ షా గో బ్యాక్.. అంటూ సిపిఎం ఆధ్వర్యంలో భోగాపురంలో ముక్కాం కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సూర్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు ఎం.రవి, దాసు, రామసూరి పాల్గొన్నారు.

బొబ్బిలిలో నిరసన చేపడుతున్న వామపక్ష, కాంగ్రెస్ నాయకులు

వేపాడ : కేంద్రమంత్రి అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా మండలంలోని బొద్దాం కూడలిలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, కార్మికులు పాల్గొన్నారు.

రామభద్రపురం : సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన రామభద్రపురం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు బలస శ్రీను, అలమండ ఆనందరావు, ధర్మారావు, భవాని, విజయ్, పరమేశు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గో బ్యాక్.. అంటూ నెల్లిమర్లలోని మొయిదా జంక్షన్‌లో వామపక్షాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, న్యూడెమోక్రసి, కాంగ్రెస్ నాయకులు కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్ని బాబు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : అమిత్‌షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ డెంకాడ మండలంలోని అక్కివరం రోడ్డుపై సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.నర్సినాయుడు, జి.పెంటరాజు, ఆటో యూనియన్ నాయకులు ఎం.రవి, రమణ, దాసు, రామసూరి పాల్గొన్నారు.

రాజాం, భోగాపురంలో నిరసనలు చేపడుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

బిపిఎం స్కూల్లో మధ్యలో ఆగిపోయిన అదనపు తరగతి గదులు(ఫైల్)

అసౌకర్యాల నడుమ మోగనున్న బడిగంట

నేటి నుంచి బడులు ప్రారంభం

సమస్యలతో స్వాగతం పలుకుతున్న పాఠశాలలు

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలల్లో బడిగంట మోగనుంది. నెలన్నర రోజుల తర్వాత పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు ప్రారంభానికి జిల్లా విద్యాశాఖాధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తరగతి గదులు, తాగునీటి, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించి, సర్వం చేస్తున్నారు. మరోవైపు అసంపూర్తిగా నాడు-నాడు పనులు ఉండటంతో మరికొద్దిరోజులు విద్యార్థులకు పాట్లు తప్పేలా కనిపించడం లేదు.

విజయనగరం జిల్లాలో మొత్తం 2230 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1,51,413 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రయివేటు బడుల్లో 92,524 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలలకు వేసవి సెలవుల్లోనే మరమ్మతులు పూర్తి చేసి, రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ బడులు కూడా అందుకు అనుగుణంగా సిద్ధం చేశారు. జిల్లాలో విద్యా సంవత్సరం ప్రారంభానికి జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ స్థాయిలో పంపిణీ చేస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. పాఠ్యపుస్తకాలు సకాలంలో వచ్చినా, షూలు, బ్యాగులు ఇంకా పూర్తి స్థాయిలో జిల్లాకు చేరుకోలేదు. ఆదివారానికి షూలు 46 శాతం, బ్యాగులు 34 శాతం వచ్చాయి. వాటిని మండలాలకు జిల్లా విద్యాశాఖాధికారులు పంపిణి చేశారు. కానీ, పూర్తిస్థాయిలో కిట్‌ను సిద్ధం చేసేందుకు వస్తువులు రాకపోవడంతో ఉన్న వాటిని అందజేస్తారా, లేక అన్ని వచ్చిన తర్వాత కిట్లు ఇస్తారా అనేది చూడాలి. నాడు-నేడు పనులు చేపడుతున్న పాఠశాలలు తప్ప మిగిలిన స్కూళ్లలో మరుగుదొడ్లు, తాగునీటి వంటి సమస్యలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు అదనపు తరగతి గదులు నిర్మించాలి. నాడు-నేడు ద్వారా మొదటి విడతలో అయిన పనులు తప్ప రెండో విడతలో 773 స్కూళ్లలో ఇంకా పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. ఈ పనులు పూర్తయ్యే నాటికి మరో ఏడాది పట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. పాఠశాలల ప్రారంభం నాటికి గ్రాంట్లు మంజూరు చేయాల్సిన ప్రభుత్వం కేవలం మొదటి విడతగా 25శాతం నిధులు మంజూరు చేయడంతో ప్రధానోపాధ్యాయులు చేతి డబ్బులు పెట్టి రంగులు వేసి, మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులకు పాత సమస్యలతో పాఠశాలలు స్వాగతం పలుకుతున్నాయి.

11.30 గంటల వరకే..

వడగాల్పుల దృష్ట్యా జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు ఈ నెల 12 నుంచి 17 వరకు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పనిచేస్తాయని డిఇఒ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు రాగిజావ, 11.30 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందజేసే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాఠశాలల పున:ప్రారంభానికి

సర్వం సిద్ధం

- నేటి నుంచి జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ
- 100 శాతం బడిబయట పిల్లల్ని చేర్పించడమే లక్ష్యం
- 'ప్రజాశక్తి'తో డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

'సోమవారం నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఘన స్వాగతం పలకడంతోపాటు అన్ని వసతులుండేలా సర్వం సిద్ధం చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుక కిట్లు కూడా తొలిరోజు నుంచి విద్యార్థులకు అందజేయనున్నాం. బడి బయట పిల్లలు ఉండకుండా అందరినీ పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేస్తున్నాం. నిన్నటి వరకు జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా సాగాయి. ఉపాధ్యాయులంతా సోమవారం నుంచే ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరనున్నార'ని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఈవారం 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వేసవి సెలవులు ముగించుకొని, నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి తీసుకున్న చర్యలు, అమలు చేసే ప్రణాళికలను ఆయన వివరించారు. ఆ వివరాలు..



విద్యా సంవత్సరాన్ని ఎలా ప్రారంభిస్తున్నారు?.

ఈ విద్యాసంవత్సరం పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాం. విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరానికి ఘన స్వాగతం పలుకుతాం. పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీటి వంటి సమస్యలు లేకుండా వేసవి సెలవుల్లోనే సర్వం సిద్ధం చేశాం.

ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు?.

జిల్లాలో ప్రభుత్వ, జెడ్‌పి, మున్సిపల్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు 1446, ప్రాథమికోన్నత పాఠశాలలు 327, ఉన్నత పాఠశాలలు 455 మొత్తం 2230 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,51,413 మంది, ప్రయివేటు పాఠశాలల్లో 92,524 మంది, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో 5328 మంది విద్యనభ్యసిస్తున్నారు. సమగ్ర శిక్ష ద్వారా బడిబయట పిల్లలు 447 మంది ఉన్నట్లు గుర్తించారు. బడిబయట పిల్లలు లేకుండా చూడాలని, అందుకు ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల్ని చేర్పించేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం. సమగ్ర శిక్ష ద్వారా ఇప్పటికే ఆ పని జరుగుతోంది. ఎవరూ బడిబయట ఉండకూడదనేది విద్యాశాఖ లక్ష్యం.

కొత్తగా విద్యాబోధనకు తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలు ఏమిటి?.

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పాఠ్యాంశ బోధన జరిగేలా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశాం. ఇప్పటికే నాడు-నేడు పనులు పూర్తి అయిన పాఠశాలల్లో ఇన్‌ట్రాక్టివ్ పానెల్స్ విధానంలో స్మార్ట్ టీవీల ద్వారా బోధనకు శ్రీకారం చుడుతున్నాం. ఈ ఏడాది 392 పాఠశాలల్లో ఈ బోధన ప్రారంభం కానుంది. బైజూస్ కంటెంట్ ప్రణాళికలను అమలు చేయనున్నాం. గతేడాది 22 వేలు లాప్‌ట్యాపులు పంపిణీ చేశారు. వీటి ద్వారా 9వ తరగతి విద్యార్థులకు బోధన జరగనుంది.

జగనన్న విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో వచ్చాయా? ఎప్పటికి పంపిణీ చేయనున్నారు?.

జగనన్న విద్యా కానుక కిట్లు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాం. వాటిలో యూనిఫాం, బెల్టులు, షాక్సులు, పుస్తకాలు, వర్కుబుక్స్, డిక్షనరీ, నోట్ పుస్తకాలు వంద శాతం వచ్చాయి. కిట్‌లో బ్యాగులు 34 శాతం, షూ 46 శాతం మాత్రమే వచ్చాయి. రెండు రోజుల్లో అవి కూడా పూర్తి స్థాయిలో రానున్నాయి. ఆదివారం సాయంత్రానికి కిట్లు సిద్ధం చేసి ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు 90 శాతం అందాయి.

నాడు-నేడు రెండో విడత పనులు ఎప్పటికి పూర్తవుతాయి?.

జిల్లాలో రెండో విడత నాడు-నేడు పనులు రూ.220 కోట్లతో 737 పాఠశాలల్లో జరుగుతున్నాయి, 117 పనులు పూర్తి కాగా, ఇంకా 1657 పనులు పురోగతి దశలో ఉన్నాయి. త్వరలో ఆ పనులన్నీ పూర్తి చేస్తాం. ఇప్పటికి రూ.72 కోట్లు వరకు ఖర్చయింది.

జగనన్న ఆణిముత్యాలు పేరుతో ఎంత మందిని సత్కరించనున్నారు?.

పదో తరగతి పరీక్షల్లో పాఠశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో మొదటి మూడు స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో సత్కరించనున్నారు. 12 నుంచి 17 తేది వరకు ఆయా దశల్లో విద్యార్థులను సత్కరించనున్నారు. 15న నియోజకవర్గ స్థాయిలో, 17న జిల్లా స్థాయిలో సత్కరిస్తారు. పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాలు వచ్చిన విద్యార్థులు 896 మంది ఉన్నారు. వారికి రూ.3000, 2000, 1000 చొప్పున నగదు అందిస్తారు. ఏడు నియోజకవర్గాల్లో 33 మందిని సత్కరించనున్నాం. వారికి రూ.15 వేలు, 10 వేలు, 5వేలు చొప్పున అందిస్తాం. జిల్లా స్థాయిలో ఏడు యాజమాన్యాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన 32 మంది విద్యార్థులకు రూ.50 వేలు, 30 వేలు, 15 వేలు చొప్పున అందజేయనున్నాం. జగనన్న ఆణిముత్యాలు కోసం రూ.26.20 లక్షల నిధులు వచ్చాయి.

ఖరీఫ్‌కు సన్నద్ధం



- 5 వేల క్వింటాళ్ల విత్తనాలు రెడీ
- అందుబాటులో 19వేల మెట్రిక్ టన్నుల ఎరువులు
- 14న జిల్లాను తాకనున్న రుతుపవనాలు
- నారుమడులు సిద్ధం చేసుకునేందుకు రైతన్న సమాయత్తం

రెండు మూడు రోజుల్లో రుతపవనాలు వచ్చే అవకాశం ఉండడంతో త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇందుకనుగుణంగా ఇటు రైతులు, అటు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతోంది. విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతుంటే, వాతావరణం చల్లబడి ఒకటి రెండు వర్షాలు కురిస్తే నారుమడులు సిద్ధం చేసుకుంటామని రైతులు చెబుతున్నారు. కొంతమంది రైతులు ఇప్పటికే నారుమడులను అదునుగా మార్చుకుంటున్నారు. మన జిల్లాకు జూన్ రెండో వారంలో రుతపవనాలు రావడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి వారం రోజులు ఆలస్యంగా అంటే 14న రుతుపవనాలు వచ్చే అవకాశముందని వాతావరణ కేంద్రం చెబుతోంది. ఈనేపథ్యంలో ఈ ఏడాది సకాలంలోనే ఖరీఫ్ ప్రారంభం కావచ్చని అధికార యంత్రాంగం భావిస్తోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ఖరీఫ్‌లో 2,90,476 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 3,03,102 ఎకరాల్లో సాగుకావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం అత్యధికంగా 2,34,112 ఎకరాల్లో వరిసాగు కానుంది. జిల్లాలో అత్యంత ప్రధాన పంట వరి. మొక్కజొన్న 31,375 ఎకరాలు, నువ్వులు 18,305 ఎకరాలు, చెరకు 11,525 ఎకరాలు, పత్తి 5,105 ఎకరాలు, వేరుశనగ 868 ఎకరాలు, రాగులు 96 ఎకరాలు, మినుములు, పెసలు, కందులు తదితర అపరాలు 329 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. అందుకనుగణంగానే విత్తనాల సరఫరా కూడా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మన జిల్లా భూసారం, నీటి లభ్యతను బట్టి ఏడు రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో ముఖ్యంగా సోనామసూరి (బిపిటి 3291) 4,520 క్వింటాళ్లు, సాంబమసూరి (బిపిటి 5204) 2,289 క్వింటాళ్లు, అమర (ఎంటియు 1064) 2,600 క్వింటాళ్లు అందుబాటులో ఉంచనున్నారు. అత్యల్పంగా సూపర్ ప్రైమ్ కొత్తరకం వెరైటీ (ఎంటియు 1318) 382 క్వింటాళ్లు, రాగోలు సన్నాలు (ఆర్‌జిఎల్ 2573) 204 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఎప్పటి మాదిరిగానే సోనామసూరి, సాంబమసూరికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. సీజన్ మొత్తానికి 42 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా ఇప్పటికే 5 వేల క్వింటాళ్లు ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని చెప్పారు. వరి విత్తనాలపై ప్రభుత్వం కిలోకు రూ.10 చొప్పున రాయితీ కల్పిస్తోంది. అన్ని రకాల పంటలకు క్రాప్ ఇన్సురెన్స్ సదుపాయం ప్రభుత్వం కల్పించింది.

ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని ఏడాదికి 82,641 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే 19వేల మెట్రిక్ టన్నులు జిల్లాలో సిద్ధంగా ఉంది. ఇందులో ఆర్‌బికెల్లో 5 వేల మెట్రిక్ టన్నులు, మార్కెట్‌లో 14 వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా యూరియా 47,401 మెట్రిక్ టన్నులు, డిఎపి 13,422 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 13,467 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 6,092 మెట్రిక్ టన్నులు, సూపర్ పాస్ఫేట్ 2,257 మెట్రిక్ టన్నుల చొప్పున జిల్లాకు రావాల్సి ఉంది. జిల్లాకు రావాల్సిన ఎరువుల్లో 50శాతం మార్క్‌ఫెడ్‌కు, మిగతా సగం ప్రయివేటు మార్కెట్‌కు వెళ్తాయి. మార్క్‌ఫెడ్‌కు వచ్చిన ఎరువుల్లో 70 శాతం ఆర్‌బికెల ద్వారా, మిగిలిన 30 శాతం పిఎసిఎస్‌ల ద్వారా రైతులకు సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు మాత్రం 50శాతం సబ్సిడీపై పొందవచ్చు. మిగిలిన పంటల విత్తనాలు ప్రయివేట్ మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా వరి విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగానే ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకోవాలి. వారు సాగుచేసే విస్తీర్ణానికి తగ్గట్టు ఆర్‌బికె సిబ్బంది ప్రతిపాదన పెడతారు. రైతులు దరఖాస్తు చేసుకున్నప్పుడే సబ్సిడీ పోగా మిగిలిన మొత్తాన్ని జమచేయాలి. ఇలా చెల్లించిన రెండో రోజుల్లోపు విత్తనాలు రైతులకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు (ఆర్ట్, వర్క్, పిజికల్ ఎడ్యుకేషన్) రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ లింగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 17 వరకు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. బదిలీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈ నెల 23న మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అయ్యన్నపేటకు చెందిన సత్యవతి కళ్యాణ మండపం అధినేత అప్పారావు తన భార్య సత్యవంతి వర్ధంతి సందర్భంగా ద్వారపూడిలోని మహాత్మా గాంధీ వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం ఏర్పాటుచేశారు. 27 మంది వృద్ధులకు భోజనాలు, మామిడి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ రాజు, వెంకటరావు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు గ్రంథాలయాలు దోహదం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పద్మావతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిల్లల్లో ఉండే సృజనాత్మకతను వెలికి తీసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి తెలిపారు. ఆదివారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు సభకు ఆమె హాజరయ్యారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. శిక్షకులకు సన్మానాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకొనేందుకు గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు చలం, డాక్టర్ పివిఎల్ఎన్ సుబ్బారావు, గణిత ఉపాధ్యాయులు జి.రాము, కె.భాస్కరరావు, చింతల నాగేశ్వరరావు, గ్రంథాలయ ఉపాధికారి బి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పద్మావతి

సద్వినియోగం చేసుకోవాలి

గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ కోరారు. గాజులరేగ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నారాయణ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మొయిద నారాయణరావు, ఆర్.బి.రామానాయుడు, శాఖ గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వసతి గృహం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీ పూడి సచివాలయ పరిధిలో గల గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఈ వసతి గృహంలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకూ 250 మంది గిరిజన విద్యార్థులు ఉంటున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం కావడం వల్ల గోడలు, స్లాబులకు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. ప్రధాన గేటు పూర్తిగా తప్పు పట్టిపోయింది. వసతి గృహాన్ని ఆనుకుని మారిక కొండ ఉంది. వర్షం వస్తే ఆ కొండ నుంచి వచ్చే వర్షపు నీటి చెమ్మతో గదులు తడిగా మారిపోతున్నాయి. చలిగాలులు, శిథిలమైన మరుగుదొడ్లతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇన్ని ఇబ్బందులున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి చేయడం లేదు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ పంచాయతీ సర్పంచ్ ఎస్‌సి, ఎంపిటిసి ఎస్‌టి అయినప్పటికీ పిల్లలపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని గిరిజన పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో మరుగుదొడ్లు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఆదివారం శ్రీకాకుళం మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సంకిలి ఇఐడి ప్యారి షుగర్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరానికి అనుహ స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్యులు గైనిక్ దానేటి శ్రీధర్, అన్నాజీరావు, అమూల్య 345 రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఈసీజీ, జనరల్ మెడికల్ నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కొంతమంది రోగులకు రిఫరల్ తరలించారు. ఈ వైద్య శిబిరంలో సర్పంచ్ కుప్పిలి గవరయ్య, శ్రీహరి రావు, ఎస్ఓ రోహిణి, మెడికవర్ ఆస్పత్రి నుంచి జనరల్ మెడిసన్ కె. మురళీ కృష్ణ, గైనకాలజిస్ట్ బి. పద్మావతి, కార్డియాలజీ అనిరుద్ కుమార్, షుగర్స్ హెచ్ఆర్ హెడ్ వి. మురళీ కృష్ణ, హెచ్ఆర్ టీమ్ ఈశ్వరరావు, స్వామి, కేన్ టీమ్ సభ్యులు పాల్గొని సేవలందించారు.

తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- బొబ్బిలి

పచ్చదనంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణకు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బెల్ట్ సొసైటీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సభ్యులు కర్రి సత్యనారాయణ, సత్యరావు, పి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ పార్వతి

బేబినాయనకి కృతజ్ఞతలు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఎరుకుల పాకాల గ్రామ సమీపంలో పెదపల్లి, గజరాయనివలస, లక్ష్మి పురం రైతులు వెళ్లే మార్గంలోని పొలంలో తాగునీటి బోరును సర్పంచ్ పార్వతీ ఆదివారం ప్రారంభించారు. పొలం పని చేసేటప్పుడు తాగు నీరుకి ఇబ్బంది అవుతుందని ఎంపిటిసి పాలవలస గౌరు బొబ్బిలి టిడిపి నియోజకవర్గ నాయకులు బేబీ నాయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన తాగు నీరు బోర్ వేయించారు. ఈ సందర్భంగా రైతులు నాలుగు గ్రామాల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు

ఎండ తీవ్రతకు ఇళ్లకే పరిమితం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇంటికే పరిమితమవుతున్నారు. దీంతో రోడ్లు, మార్కెట్లు బోసిపోతున్నాయి. ఈ ఎండలు, వడగాల్పులకు చిన్నారులు, వృద్ధులు, బాలింతలు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకి వర్షాలు పడితే తప్ప ప్రజలు ఉపసమనం పొందే పరిస్థితి కనిపించడంలేదు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుండి 12 గంటల వరకు జరిగిన పరీక్షలో 172 మంది అభ్యర్థులకు గాను 163 మంది హాజరై పరీక్ష రాశారు. పరీక్షలను స్టేట్ పరిశీలకులు ఎంఆర్ఎ సామ్యూల్, ఆర్‌జెడి ఎం. జ్యోతికుమారి పరిశీలించారు. మెరిట్ లిస్టు 16న, సెలక్షన్ లిస్ట్ 18న హెడ్ ఆఫీస్ నుంచి మెయిల్ చేస్తారని, ఎంపికైన వారికి 19 నాటికీ అడ్మిషన్ పూర్తి చేసి 21వ తేదీ నుండి క్లాసులు మొదలవుతాయని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గర్భిణులకు సంపూర్ణ పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి- భోగాపురం

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా మండలంలోని దిబ్బలపాలెం అంగన్వాడీ కేంద్ర పరిధిలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసిడిఎస్ పరిధిలోని లబ్ధిదారులకు అందజేస్తున్న సరుకులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని సూపర్‌వైజర్ నాగమణికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరజర్ల నరసింహులు, దల్లి బంగారు రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగమణి, నాయకులు చిన్న, పూడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం యువరాణుల కోసం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళల కోసం ప్రత్యేకంగా ఫ్యాన్సీ డిజైనర్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన మాత్రిక డిజైనర్స్ ఆధ్వర్యంలో విజయనగరం యువరాణుల కోసం ఎస్‌విఎన్ లేక్ ప్యాలెస్‌లో ఆదివారం ఎగ్జిబిషన్, సేల్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను మేయర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం యువరాణుల పేరిట ప్రత్యేకంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ యువతులను ఆకట్టుకునే విధంగా వెరైటీ వస్త్రాలను తగ్గింపు ధరలకు అమ్ముతు న్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, జనసేన నాయకుడు గురాన అయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

నత్తనడకన నాడు - నేడు రెండో దశ పనులు

• నేటి నుండి ఇరుకు గదుల్లోనే మళ్లీ చదువులు • ఒక్కో చోట ఒక్కో కారణంతో ముందుకు కదలని పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో నాడు-నేడు ఫేజ్ టు పాఠశాలల నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో కారణంతో పనులు ముందుకు కదలకపోవడంతో మళ్లీ ఇరుకు గదులు, అసౌకర్యాల నడుమే విద్యార్థులు సోమవారం నుంచి చదువులు కొనసాగించనున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలన్న సంకల్పంతో రెండో విడత నాడు నేడు ద్వారా నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించలేకపోవడంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. దీంతో వేసవి సెలవులు పూర్తయినప్పటికీ పాఠశాలల అభివృద్ధి పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో పాత సమస్యలే పిల్లలను వేధించనున్నాయి.

మండలంలోని నాడు నేడు - ఫేజ్ టు కింద 16 పాఠశాలలను ఎంపిక చేశారు. అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు వంటి అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇందుకోసం రూ. 4.26 కోట్లు నిధులను కూడా మంజూరు చేసింది. వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేసి పాఠశాలల పున:ప్రారంభం నాటికి అందించాలని ఆదేశించింది. అయినప్పటికీ ఎక్కడా పనులు మాత్రం పూర్తి కాలేదు.

పూర్తి స్థాయిలో సరఫరా కానీ పాఠ్య పుస్తకాలు

మండలంలో 35 మండల పరిషత్ పాఠశాలలు, 5 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలు, 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీ ఆదర్శ పాఠశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం, కేజీబీవి వసతి గృహం, గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహం ఉన్నాయి. అయితే ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ పూర్తిగా రాలేదు. వచ్చిన పుస్తకాలను ఇప్పటికే పాఠశాలలకు పంపిణీ చేశారు. రెండో తరగతి, నాల్గో తరగతి మ్యాథ్స్ బుక్స్ రావాలి, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ బుక్స్ రావాలి. విద్యార్థులకు అందవలసిన షూష్, బెల్టులు, సాక్షులు రావలసి ఉంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తీర్ణత శాతం బాగా తగ్గింది. మండలంలో మొత్తం377 విద్యార్థులు పదవతరగతి పరీక్షలు రాయగా 222 మంది ఉత్తీర్ణత సాధించి 58.89 శాతం మాత్రమే ఉత్తీర్ణులు కావడం నిరాశకు గురిచేసింది.

కెజిబివిలో నిలిచిపోయిన అదనపు గదులు నిర్మాణం

కూలీల కొరతతోనే పనుల్లో జాప్యం

కూలీల కొరత వల్లే అనుకున్న సమయానికి పాఠశాల భవన నిర్మాణాలు జరగలేదు. కొన్ని చోట్ల పాఠశాల విద్యా కమిటీ సహకారం కూడా దొరకలేదు. మండలంలో ఉన్న 16 పాఠశాల్లో పనులు పూర్తి కావాలంటే మరో నెల రోజులు పట్టే అవకాశం ఉంది.

జి. శ్రీదేవి, మండల విద్యాశాకాధికారి వేపాడ

ఊరు	పాఠశాలస్థాయి	నిధులు(రూ. లక్షల్లో)
బల్లంకి	ప్రాథమిక	5
ఆతవ	,,	5
ఓబలయ్యపాలెం	,,	5
ముకుందపురం	,,	5
వావిలపాడు	,,	12
చిన్నదున్నాడ	,,	25
డిఆర్‌పేట	,,	2.5
చామలాపల్లి	,,	2.5
ఆర్ఎస్‌పేట	,,	2.5
వేపాడ	,,	34
సోంపురం	,,	2.5
సోంపురం	ఉన్నత	42
ఎన్‌కెఆర్‌పురం	,,	94
వావిలపాడు	,,	120
వేపాడ	,,	39
బక్కునాయుడుపేట	కెజిబివి	29.88
మొత్తం		4.26 కోట్లు

లక్ష్మింపేట ఘటనకు 11 ఏళ్లు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని లక్ష్మింపేట దళితులను, పెత్తందారులు ఊచ కోత కోసిన ఘటనకు నేటితో 11 ఏళ్లు పూర్తయింది. ఈ ఘటన జూన్ 12, 2012లో జరిగింది. మడ్డువలస ప్రాజెక్టు మిగుల భూములు కోసం పోరాటం చేసిన లక్ష్మిం పేటకు చెందిన ఐదుగురు దళితులు పెత్తం దార్లు చేతుల్లో బలయ్యారు. ఈ ఘటన తలుచుకుని దళిత కుటుంబాలకు చెందిన వారంతా కలత చెందుతున్నారు. అప్పట్లో ప్రభుత్వం దళిత కుటుంబాలకు ఇచ్చిన హామీలన్నీ నేటికీ కూడా అమలు కాకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా చేస్తామన్న హామీలు గాల్లో కలిసిపోయాయి. ఆ గ్రామంలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చును.

కొనసాగుతున్న న్యాయ విచారణ

మండలంలోని లక్ష్మింపేట ఘటన కేసుకు సంబంధించి అప్పట్లో దళిత, ప్రజాసంఘాల నాయకులు పోరాట ఫలితంగా ప్రభుత్వం లక్ష్మిం పేట గ్రామంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసింది. ఈ ఘటన కేసులో 80 మంది నిందితులున్నారు. ఇందులో ఇప్పటికే కొంతమంది నిందితులు మృతి చెందారు. ప్రత్యేక కోర్టులో ప్రస్తుతం న్యాయ విచారణ కొనసాగుతుంది. ఈ కేసు ఎప్పుడు పూర్తయి నిందితులకు శిక్షలు పడి బాధిత దళిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందోనని ఎదురు చూస్తున్నారు.

సుందరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు(ఫైల్)

ఘనంగా జిఎంఆర్ ఐటి గ్రాడ్యుయేషన్ డే

రాజాం: జెఎన్‌టీయు-వి, విజయనగరంకి అనుబంధంగా ఉన్న స్వయం ప్రతిపత్తి సంస్థ జిఎమ్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తన 8వ గ్రాడ్యుయేషన్ డే వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించింది. జిఎమ్ఆర్ ఐటీ యాజమాన్యం, సిబ్బంది, సభ్యులు, విద్యార్థుల నేతృత్వంలో అతిథుల సమక్షంలో ఉత్సాహంగా కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిఎల్‌విఆర్ఎస్‌వి ప్రసాద్ సంస్థ సాధించిన విజయాలు, మైలురాళ్లను, గ్రాడ్యుయేషన్ డే నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పొందుతున్న 853 మంది విద్యార్థుల్లో 80శాతం మంది వివిధ కంపెనీల్లో చేరారని, సగటున 4.57 ఎల్‌పిఎ సాధించారని తెలిపారు. జిఎమ్ఆర్ ఐటీలో గరిష్ట పరిహారం 11 ఎల్‌పిఎ గ్రాడ్యుయేట్లు విజయం కోసం కాకుండా పరిపూర్ణత కోసం పని చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు, సివిల్ సర్వెంట్లుగా మారాలని ఆయన సూచించారు. గవర్నింగ్ కౌన్సిల్ చైర్పర్సన్ డాక్టర్ జె. గిరీష్ ప్రసంగిస్తూ కెరీర్ పై 60శాతం ప్రభావం పూర్తిగా నైపుణ్యాభివృద్ధిపైనే ఉంటుందని విద్యార్థులకు తెలియజేశారు. జిఎంఆర్ వీఎఫ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎల్ఎమ్ లక్ష్మణమూర్తి యువ గ్రాడ్యుయేట్లు శ్రేష్ఠతకు పాటుపడుతూ సమాజానికి దోహదపడాలని సూచించారు. జిఎమ్ఆర్ వీఎఫ్ సీఈఓ అశ్విని లోహని గ్రాడ్యుయేట్ల ముందున్న అవకాశాలపై మాట్లాడారు. విజయనగరం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ అనేది కొందరికి మాత్రమే కాకుండా, మేధో జీవితానికి సంబంధించిన నైతిక అధ్యయనం అన్నారు. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మునుపటి తరాలు అభివృద్ధి చేసిన సైన్స్ అండ్ టెక్నాలజీ మనల్ని వివిధ సమస్యలు, కోవిడ్ 19 నుండి రక్షించింద చెప్పారు. సూర్యుడి నుండి తదుపరి తరం ఇంధనం హైడ్రోజన్‌ను ఎలా తీయాలో కనుగొనాలని ఆయన వారిని కోరారు. అనంతరం విద్యార్థుల అత్యుత్తమ విజయాలను గుర్తిస్తూ స్కాలస్టిక్ అవార్డులు, సంస్థాగత బంగారు, వెండి పతకాలు, డిగ్రీలను ప్రదానం చేశారు.

హామీల అమల్లో వైసిపి విఫలం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల హామీలు అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పలువురు వక్తలు అన్నారు. లోకబందు రెసిడెన్సీలో ఆదివారం జనసేన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినప్పటికీ నాలుగేళ్లు కావస్తున్నా ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. దీంతో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక అభివృద్ధి లేదన్నారు. పించనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి యువతలో ప్రశ్నించేతత్వం రావాలన్నారు. ప్రశ్నించే హక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య విలువలు దిగజారిపోతున్నా యన్నారు. ప్రజలంతా రాజ్యాంగ హక్కులు కోసం పోరాటం చేయాలన్నారు. గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరువులు ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోవడం లేదన్నారు. రోడ్లు విస్తరణ జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో పైపులైన్ లీకులను నివారించకపోవడంతో తాగునీరు వృథాగా పోతుందన్నారు. ఇసుక దోపిడీ, మద్యం అక్రమ అమ్మకాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ బొబ్బిలిలో ప్రభుత్వ ఆస్తులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. చక్కెర పరిశ్రమ మూత పడడంతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిటైర్డ్ ఉద్యోగి పి.సత్యంనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో చక్కెర, జ్యూట్ పరిశ్రమలు మూత పడ్డాయన్నారు. పెట్టుబడులు పెరుగుతున్న గిట్టుబాటు ధరలు పెంచడం లేదన్నారు. టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు సుంకరి సాయిరమేష్ మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బజారు రోడ్డు విస్తరణకు వ్యాపారులు వ్యతిరేకం కాదని, రోడ్డు అక్రమణ జరగకుండా చూడాలన్నారు. చెరువులు కబ్జాలకు గురవుతున్న అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు అన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

మాట్లాడుతున్న పింఛనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మూర్తి

ఎస్‌సి కాలనీవాసుల ఆగ్రహం

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

భూఆక్రమణకు అడ్డూ ఆపూ లేకుండా పోతుంది. భూమిని ఆక్రమించడానికి మహనీయుని విగ్రహాన్ని అడ్డం పెట్టుకోవడాన్ని ఎస్‌సి సామాజిక వర్గానికి చెందినవారు తీవ్రంగా ఖండిస్తున్నారు. భూ ఆక్రమణకు భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ఉపయోగించడంతో కాలనీ వాసులు ఏక కంఠంతో ఆదివారం వ్యతిరేకించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తమ కాలనిలోనే ఏర్పాటు చెయ్యాలని నినదించారు.

మండలంలోని కొట్యాడ గ్రామ పంచాయితీలో ఉన్న ఎస్‌సి కాలనీలో సుమారు 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతి ఊర్లో ఉండే మాదిరిగానే తమ కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పంచాయతీకి విన్నవించుకున్నారు. వారి విన్నపం మేరకు కాలనీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేసింది. ఇదిలా ఉండగా కాలనీలో కాకుండా వేరే చోట భూమి ఆక్రమణ కొరకు రాత్రికి రాత్రే అంబేద్కర్ విగ్రహాన్ని కొంత మంది అక్రమార్కులు ప్రతిష్టించారు. ఈ విషయంపై 'ఆక్రమణ భూమిలో అంబేద్కర్ విగ్రహం' అనే శీర్షికతో ప్రజాశక్తిలో ఆదివారం వెలువడిన కథనం వెలువడింది. దీనికి గ్రామస్తులు స్పందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మద్దిల నాగరాజు మీడియాతో మాట్లాడుతూ తమ గ్రామస్తుల కోరిక మేరకు అంబేద్కర్ విగ్రహాన్ని కాలనీలో ఏర్పాటు చేయాలని కోరారు. భూ ఆక్రమించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ ఆశయాలను కాలరాస్తూ ఆయన విగ్రహాన్ని రాత్రికి రాత్రి ఆక్రమిత భూమిలో ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏదేమైనప్పటికీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తమ కాలనీలోనే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మల్లవరపు అప్పారావు, మద్దిల తాతబాబు, ఎద్దు అప్పారావు, గుడివాడ గురేష్, వార్డు సభ్యులు తలారి దేవి, ఎద్దు యర్రయ్య, కొట్యాడ దేముడుబాబు, అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న దళితులు

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి- దెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11 వరకూ నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రేచర్ల కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో నిర్వహించిన ఈ శిబిరం పిల్లలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జామి: స్థానిక శాఖ గ్రంథాలయంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆదాయ పన్నుల శాఖ అధికారి మంజీర కిషోర్ ముఖ్య అతిగా పాల్గొని, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు, 21మంది విద్యార్థులు, గ్రంథాలయధికారి బి. మేరీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. సర్పంచ్ కండి రమేష్ మాట్లాడుతూ నెల రోజులు పాటు జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఎంపిటిసి దేవరాపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలకు గ్రంథాలయం ద్వారా అందుతున్న సేవలను గుర్తు చేస్తూ పిల్లలు అందరూ ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోనే అత్యధిక మార్కులు సాధించిన కానూరు మురారిని అభినందిస్తూ ప్రోత్సాహకాన్ని అందచేశారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిండ్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రవి బాబు, ఎంఇఓ కృష్ణమూర్తి, ఎఎస్ఐ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: బహుమతులతో విద్యార్థులు

వేపాడ: స్థానిక శాఖ గ్రంథాలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ నెల రోజులు పాటు విద్యార్థులకు కవితలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. వీరికి ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. శాఖ గ్రంథాలయ అధికారి రాంబద్ర రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గంట్యాడ గ్రామ ఉప సర్పంచ్ కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయ అధికారి రాంబద్ర రాజు మాట్లాడుతూ విద్యార్థుల పుస్తక పఠనాన్ని అలవర్చు కోవాలన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

భూ సేకరణలో రూ.25 కోట్ల అవినీతి

ప్రజాశక్తి- గంట్యాడ

గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి చేపట్టిన భూ సేకరణలో రూ. 25 కోట్ల అవినీతి జరిగిందని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు ఆరోపించారు. ఆదివారం గంట్యాడలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడత గెజిట్ నోటిఫికేషన్ జూన్ 2021న ఇచ్చిన తరువాత ల్యాండ్ కన్వర్షన్ చేసి ఎమ్మెల్యే, అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గంట్యాడ మండలంలోని కోర్లం, బురదపాడు, గ్రామాల్లో సేకరించిన భూముల్లో ఈ అవనీతి జరిగిందన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సదరు భూములకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ చేయడానికి ఆస్కారం లేదని నిబంధనలకు విరుద్ధంగా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ల్యాండ్ కన్వర్షన్ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మోసం చేసి అవినీతికి పాల్పడ్డారని అన్నారు. అవినీతిపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంఐ హైకోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ అల్లు విజయ్ కుమార్, రంధి చిన్న రామనాయుడు, బూడి గాంది, పార్టీ నాయకులు పల్లి వెంకటరావు, రొంగలి కృష్ణ, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి -బొబ్బిలి

బొబ్బిలిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. సెలవు రోజు అక్రమార్కులు రెచ్చిపోయి చెరువులలో గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అక్రమార్కులు ఆగడాలకు హద్దే లేకుండా పోతుంది. కోమటిపల్లి ప్రాంతం నుంచి అధికార పార్టీకి చెందిన జేసిబి యజమాని చెరువులలో గ్రావెల్, మట్టి జేసీబీతో తవ్వి టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమంగా తవ్విన మట్టి, గ్రావెల్‌ను గొల్లపల్లి సమీపంలో ఉన్న దాడితల్లి కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నాయుడుకాలనీలో వేసి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని, అక్రమంగా మట్టి తవ్వుతున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లారీతో తరలిపోతున్న మట్టి

కెఎల్ వలసలో ఐదిళ్లు దగ్ధం

సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని కొండ లింగాలవలస గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాందలో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. ఆదివారం ఉదయం బంగారమ్మ గ్రామదేవత గుడిలో పూర్ణ కుంభం నెలకొల్పే క్రమంలో భాగంగా గ్రామస్థులంతా జక్కువ గ్రామానికి వెళ్ళారు. ఈ సమయంలో అగ్ని ప్రమాదం సంభించినట్లు స్థానికులు చెబుతున్నారు. డోల శంకర రావు, కోటేశ్వర రావు, సన్యాసి రావు, నాగమ్మ, తిరుపతమ్మల ఇల్లు ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. బాధితులంతా ఓకే కుటుంబానికి చెందినవారు. గ్రామంలో పెద్దలు లేకపోవడం, సిలిండర్లు ఎగసి పడడంతో మంటలు ఆర్పేందుకు ఎవ్వరూ సాహసించలేకపోయారు. కట్టు బట్టలు మినహా సర్వం ప్రమాదంలో కాలిపోయాయి. ఇంట్లో వెలిగించిన దీపంను ఎలుకలు తీసుకుపోవడం వల్ల ప్రమాదం వాటిల్లి వుంటుందని అంతా భావిస్తున్నారు.

కాలి బూడిదైన పూరిళ్లు